సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 17 । మార్చి । 2024



రాజీయే రాజమార్గం - 8లో

రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు.



బెదిరించి బంగారం దోపిడీ

రామభద్రపురం మండల కేంద్రంలోని సోంపురం రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది (సా॥)	సోమ (ఉ॥)
6.12	4.40

గెలుపు గుర్రాలు

- రెండు జిల్లాల్లో రాజాం మినహా అన్నిచోట్లా ఎమ్మెల్యేలే అభ్యర్థులు
- విజయనగరం అసెంబ్లీ మినహా టిక్కెట్లన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీలవే!
- సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితా
- గెలుపు ఉత్సాహంతో ఎన్నికల బరిలోకి దిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ' అని చెప్పే ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి... తన మాటలను ఆచరణలోనూ చూపించారు. బీసీల ఖిల్లాగా పేరున్న ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు శనివారం నగారా మోగింది. అంతకు కొద్దిగంటల ముందే ఇడుపుల పాయ వేదికగా వైఎస్సార్‌సీపీ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలు ఒకేసారి విడుదలయ్యాయి. జిల్లాలో విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం సహా అసెంబ్లీ సీట్లలోనూ బీసీలకు సమున్నత స్థానం దక్కింది. ఒక్క విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం మినహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకే టికెట్లు ఇచ్చారు. రాజాం అసెంబ్లీ నియోజకవర్గం తప్ప మిగిలిన అన్నిచోట్లా ఎవరైతే 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని మట్టికరిపించారో ఇప్పుడూ ఆయా నాయకులే మళ్లీ బరిలోకి దిగుతున్నారు. ఇటీవలే రాజ్యసభకు గొల్ల బాబూరావు (ఎస్సీ) ఎన్నిక కావడంతో ఖాళీ అయిన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఈసారి పోటీకి దిగుతున్నారు. కంబాల స్థానంలో రాజాం టికెట్‌ను వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పేరొందిన వైద్యుడు తలే రాజేష్‌కు ఇచ్చింది. ఆయన ఒక్కరే తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. మిగతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరూ గెలుపుగుర్రాలే!

- కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నాయకుడైన అశోక్ గజపతిరాజును మట్టి కరిపించిన బెల్లాన చంద్రశేఖర్ మరోసారి బరిలోకి దిగుతున్నారు. ఈసారి కూడా ఆయన చేతిలో ఓడిపోవడం ఇష్టం లేకో ఏమో గానీ అశోక్ గజపతిరాజు అస్త్రసన్యాసం చేసేశారు.
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేయనున్నారు. ఆయన భార్య, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిని వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దింపింది. గతంలో ఆమె రెండు పర్యాయాలు విజయనగరం నుంచి ఎంపీగా గెలుపొందారు. బొత్స సత్యనారాయణ కూడా 1999లో బొబ్బిలి ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టారు. తర్వాత రాష్ట్ర రాజకీయాలపై దృష్టి పెట్టిన ఆయన అసెంబ్లీకే నాలుగు దఫాలు ఎన్నికయ్యారు. ఇప్పుడు ఐదోసారి బరిలోకి దిగుతున్నారు.
- బొత్స అప్పలనర్సయ్య కూడా నాలుగోసారి గజపతినగరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు.
- జిల్లాలో మరో సీనియర్ నాయకుడైన శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కూడా బొబ్బిలి నుంచి ఐదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. గతంలో ఇదే నియోజకవర్గంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతో, ఫ్యాన్ గుర్తుపై గెలిచినా చంద్రబాబు మాయతో టీడీపీలోకి ఫిరాయించిన బొబ్బిలి రాజును 2019 ఎన్నికల్లో శంబంగి మట్టికరిపించారు. మరోసారి ఆ బొబ్బిలి రాజు సోదరుడు బేబీనాయనపై ఎన్నికల సమరభేరి పూరించనున్నారు.
- టీడీపీకి జిల్లా పెద్ద దిక్కుగా ఉన్న అశోక్ గజపతిరాజు ఈసారి పోటీ నుంచి తప్పుకొని తన కుమార్తెను విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీచేయిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఆమెపై విజయభేరి మోగించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడైన కోలగట్ల వీరభద్రస్వామి... ఈసారి కూడా ఆమెపై ఘన విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీగా రెండుసార్లు, ఎమ్మెల్యేగా రెండుసార్లు అనుభవం ఉన్న ఆయనతో ఏమాత్రం రాజకీయ అనుభవం లేని అభ్యర్థి అదితి గజపతిరాజు పోటీపడుతున్నారు.
- ఒకసారి జెడ్పీ చైర్మన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీచేయడం ఇది నాలుగోసారి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టెంకాయ కొట్టి వదిలేసిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భుజానకెత్తుకొని శరవేగంగా పూర్తి చేయించడం, చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం బడ్డుకొండ విజయానికి కలిసొచ్చే అంశాలే.
- అడ్డంకులన్నీ అధిగమించి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గం నుంచే మరోసారి పోటీకి దిగుతున్నారు. అతనికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ ఎమ్మెల్సీ రఘురాజు, అతని భార్య, అనుచరులు వీధిపోరాటానికి దిగినా చివరకు వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం కడుబండినే బరిలోకి దించింది.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే...

లోక్‌సభ నియోజకవర్గాలు....

	నియోజకవర్గం	వైఎస్సార్‌సీపీ అభ్యర్థి	సామాజిక వర్గం
	విజయనగరం	బెల్లాన చంద్రశేఖర్	బీసీ (తూర్పు కాపు)
	విశాఖపట్నం	డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి	బీసీ (తూర్పు కాపు)
	అరకు	చెట్టి తనూజారాణి	ఎస్టీ (వాల్మీకి)

అసెంబ్లీ నియోజకవర్గాలు...

	నియోజకవర్గం	వైఎస్సార్‌సీపీ అభ్యర్థి	సామాజిక వర్గం
	రాజాం (ఎస్సీ)	డాక్టర్ తలే రాజేశ్	ఎస్సీ (మాల)
	విజయనగరం	కోలగట్ల వీరభద్రస్వామి	ఓసీ (వైశ్య)
	బొబ్బిలి	శంబంగి వెంకటచిన అప్పలనాయుడు	బీసీ (కొప్పుల వెలమ)
	గజపతినగరం	బొత్స అప్పలనర్సయ్య	బీసీ(తూర్పు కాపు)
	చీపురుపల్లి	బొత్స సత్యనారాయణ	బీసీ(తూర్పు కాపు)
	నెల్లిమర్ల	బడ్డుకొండ అప్పల నాయుడు	బీసీ(తూర్పు కాపు)
	శృంగవరపుకోట	కడుబండి శ్రీనివాసరావు	బీసీ(కొప్పుల వెలమ)
	పార్వతీపురం	అలజంగి జోగారావు	ఎస్సీ (మాదిగ)
	కురుపాం	పాముల పుష్పశ్రీవాణి	ఎస్టీ (కొండ దొర)
	సాలూరు	పీడిక రాజన్నదొర	ఎస్టీ (జాతాపు)
	పాలకొండ	విశ్వాసరాయి కళావతి	ఎస్టీ (జాతాపు)

మన్యంలో ఆ నలుగురే...

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మరోసారి సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచే బరిలోకి దిగుతున్నారు. వరుసగా మూడుసార్లు విజయంతో హ్యాట్రిక్ కొట్టిన ఆయన నాలుగోసారి కూడా విజయ పతాకం ఎగురవేయడానికి వ్యూహరచన చేస్తున్నారు.
- మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి కూడా కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో హ్యాట్రిక్ కొట్టడానికి ఉవ్విళ్లూరుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగించిన సంక్షేమ, అభివృద్ధి పాలనే విజేతగా నిలుపుతుందన్న ధీమా వ్యక్తంచేస్తున్నారు.
- మరో సీనియర్ గిరిజన నాయకురాలైన విశ్వాసరాయి కళావతి కూడా పాలకొండ అసెంబ్లీ నియోజకర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించడానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. తన నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామం వారినీ పేరుపేరునా ఆత్మీయంగా పలుకరిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా ఉంటున్న కళావతి మరోసారి గెలుపు బావుటా ఎగురవేయడానికి సిద్ధమయ్యారు.
- పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అలజంగి జోగారావుకే మరోసారి పార్టీ అధిష్టానం అవకాశం ఇచ్చింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి మార్కు చూపించిన ఆయన 2024 ఎన్నికల్లోనూ వరుసగా విజయం సాధించడానికి సన్నద్ధమయ్యారు.







జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా వెంకటేశ్వరరావు

- ఉత్తర్వులు జారీ చేసిన శాప్



విజయనగరం: విజయనగరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావును నియమిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావును విజయనగరం బదిలీ చేయడంతో పాటు ఆ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు విజయనగరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా వ్యవహరించిన ఎం.అచ్యుత్‌కుమార్‌ను విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలోని ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా చిన్నప్పన్న



బర్రి చిన్నప్పన్న

విజయనగరం: పార్టీ సంస్థాగత నియామకాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్‌లో విజయనగరానికి చెందిన బర్రి చిన్నప్పన్నకు స్థానం లభించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బర్రి చిన్నప్పను బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన చిన్నప్పన్నకు రాష్ట్రస్థాయి నియామకాల్లో చోటు దక్కడంతో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జనన మరణాల నమోదు తప్పనిసరి

పార్వతీపురం: జనన మరణాల నమోదు తప్పనిసరని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధిహామీ, వైద్యఆరోగ్య శాఖలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన మరణాల చట్టం -2023 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. దీని ప్రకారం విద్యాసంస్థల్లో చేరేందుకు, డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు, ఓటరు జాబితా తయారీకి, వివాహ నమోదుకు, ఉద్యోగాల్లో చేరేందుకు, పాస్‌పోర్టు జారీకి, ఆధార్‌కార్డు పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఏ ఇతర కార్యక్రమానికైనా విధిగా జనన ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. జనన మరణాలను 30 రోజుల్లో నమోదు చేయాలని, ఇది జరిగిన ఏడు రోజుల్లో ధ్రువీకరణ పత్రం జారీ అవుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఎస్‌డీసీ జి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

• ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో ఈశ్వరరావు మృతదేహం

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్.కోట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పచ్చిపులుసు ఈశ్వరరావు(53) అతని భార్య రమాదేవితో కలిసి బైక్‌పై విజయనగరం వైపు శనివారం వెళ్తున్నారు. తానవరం గ్రామానికి చెందిన బత్తుల మహేష్, వెంకటరమణ, పేట గ్రామానికి చెందిన ముసినాన శివ బైక్‌పై ఎస్.కోట వైపు వెళ్తున్నారు. వసాది గ్రామం దాటిన తర్వాత కొత్త వెలగాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న వారు, వెనుక కూర్చొన్న వారు తుళ్లి కింద పడిపోయారు. వీరిలో తలకు బలమైన గాయమైన ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. రమాదేవి, మహేష్, శివలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సులపై చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ సురేంద్ర నాయుడు చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



అనిల్ కుమార్(ఫైల్)

బొబ్బిలి: ఆర్థిక పరమయిన తొందర పాటు నిర్ణయం తీసుకున్నందుకు తండ్రి మందలించాడని కుమారుడు క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొబ్బిలిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ జి.భాస్కరరావు విలేకర్లకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడకు చెందిన నామా బుచ్చిరాజు తన కుమారుడు నామా అనిల్‌కుమార్(30)తో కలసి మండలంలోని కొత్తపెంట గ్రామం బెల్లం క్రషర్ ఆడేందుకు వచ్చి సీజన్ ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ నేపథ్యంలో తమ గ్రామం నుంచి తీసుకువచ్చిన ఆవును విక్రయించేసి వెళ్లిపోదామని అనుకుని రూ.56వేల విలువ చేసే ఆవును రూ.50 వేలకు బుచ్చిరాజు కుమారుడు గ్రామంలోనే విక్రయించేశాడు. ఎందుకు తక్కువకు విక్రయించావని తండ్రి మందలించడంతో క్షణికావేశానికి లోనైన అనిల్‌కుమార్ శుక్రవారం బొబ్బిలిలో క్రిమి సంహారక మందు కొనుగోలు చేసి ఓవర్ బ్రిడ్జి వద్ద తాగేశాడు. ఈ విషయాన్ని తన బావ అయిన అభిమన్యుకు తెలియజేశాడు. కొత్తపెంటలో ఉన్న అభిమన్యు ద్వారా విషయం తెల్సుకున్న తండ్రి బుచ్చిరాజు వచ్చి బొబ్బిలి ఆస్పత్రి నుంచి విజయనగరం, అక్కడి నుంచి విశాఖ, అక్కడి నుంచి కాకినాడకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై జి.భాస్కరరావు తెలిపారు.

'గేట్'లో రఘురాంనాయుడుకు 889వ ర్యాంకు



బోని రఘురాం నాయుడు

గజపతినగరం: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన బోని రఘురాంనాయుడుకు శనివారం వెలువడిన ఆల్ ఇండియా గేట్ ఫలితాల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 889వ ర్యాంకు వచ్చింది. నాయుడును తల్లితండ్రులు బోని శ్రీనివాసరావు, అనసూయతో పాటు స్థానికులు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

మోగిన ఎన్నికల భేరి





కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

• మే 13న ఎన్నికలు
• అమల్లోకి ప్రవర్తన నియమావళి
• అన్నింటిపైనా నిఘా
• బదిలీలపై నిషేధం

సహాయ కేంద్రం	ఫోన్ నంబర్
కలెక్టర్ కార్యాలయం	08963 79612, 08963 293046
ఎస్పీ కార్యాలయం	89775 19101

అమల్లోకి ఎన్నికల నియమావళి

జిల్లాలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీని అమలుకు అధికారులంతా తక్షణ చర్యలు తీసుకోవాలి. పటిష్టంగా అమలు చేయాలి. జూన్ 6వ తేదీ వరకు ఇది ఉంటుంది. – నిషాంత్‌కుమార్, కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జిల్లాలోని అరకు పార్లమెంట్ పరిధి, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13న ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడగా.. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29వ తేదీ వరకు విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విడుదల చేయడంతో ఆ క్షణం నుంచి కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. అధికారులంతా ఎన్నికల సంఘం పరిధిలో పని చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ ఏడాది జనవరి 22న విడుదలైన ఓటర్ల తుది జాబితా ప్రకారం మొత్తం 7,75,598 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 3,78,764, మహిళలు 3,96,766 కాగా.. ఇతరులు 68 మంది ఉన్నారు. నియోజకవర్గాలవారీగా పాలకొండలో 1,93,667 మంది, కురుపాం 1,92,636, పార్వతీపురం 1,87,854, సాలూరులో 2,01,441 మంది ఓటర్లున్నారు. నామినేషన్ల చివరి వరకూ ఓటు నమోదుకు అవకాశం కల్పించడంతో ఈ సంఖ్య మారవచ్చు. ఓటింగు ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పాలకొండ నియోజకవర్గంలో 287, కురుపాంలో 268, పార్వతీపురంలో 233, సాలూరులో 243 చొప్పున పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులోనూ కొన్ని అభ్యంతరాలు ఉండటంతో మార్పులు, చేర్పులకు ప్రతిపాదనలు పంపారు. అన్నిచోట్లా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు.

తస్మాత్.. జాగ్రత్త

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు తెరిచారు. దాదాపు రెండు నెలల పాటు కోడ్ అమల్లో ఉంటుంది. దీన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, బహిరంగ ప్రదేశాల వద్ద నేతల చిత్రాలతో ఉన్న ఫొటోలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు, కటౌట్లు తొలగించాల్సి ఉంటుంది. వివిధ ఇంజినీరింగ్ శాఖల ద్వారా అభివృద్ధి పనుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రారంభించి, జరుగుతున్న వాటిని కొనసాగించవచ్చు. పనులు మంజూరైనప్పటికీ మొదలు కానట్లయితే వాటిని తాజాగా ప్రారంభించరాదు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల బదిలీలపై నిషేధం ఉంటుంది. మరోవైపు కోడ్ పూర్తయ్యే వరకు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందనను రద్దు చేస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి కేశవనాయుడు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఇది అమల్లో ఉంటుందని చెప్పారు.

బరిలో నిలిచేది వారే...

2019 ఎన్నికలకు సంబంధించి మార్చి 10న షెడ్యూల్ వెల్లడైంది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగాయి. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈసారి ప్రకటన వెలువడిన నాటి నుంచి సుమారు 57 రోజులు ఎన్నికకు సమయం ఉంది. దీంతో ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల ప్రచారానికి అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. ఈ విషయంలో అధికార వైఎస్సార్‌సీపీ ముందంజలో ఉంది. ప్రజలను కలసి ఈ ఐదేళ్లలో తాము చేసిన మంచిని, అభివృద్ధిని, సంక్షేమ పాలనను వివరిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ శనివారమే ఎన్నికల బరిలో నిలిచే తమ అభ్యర్థులను ప్రకటించింది. నాలుగు నియోజకవర్గాల్లోనూ మరలా సిట్టింగులకే అవకాశం కల్పించింది. పార్వతీపురం నుంచి అలజంగి జోగారావు, సాలూరు పీడిక రాజన్నదొర, కురుపాం పాముల పుష్పశ్రీవాణి, పాలకొండ విశ్వాసరాయి కళావతి బరిలో దిగుతున్నారు. టీడీపీ కూడా సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గ అభ్యర్థులను ఖరారు చేయగా.. పాలకొండ పెండింగ్‌లో పెట్టింది.

రేపటి నుంచి పదోతరగతి పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పదోతరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నట్టు కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. పరీక్షలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. పదోతరగతి పరీక్షలపై కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. పదోతరగతి పరీక్షలకు 10,534మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానుండగా, ఇందులో 5,124మంది బాలురు, 5,410మంది బాలికలు ఉన్నారన్నారు. గతంలో ఉత్తీర్ణత కాని 664 మంది విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మొత్తం 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, మూడు ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

మార్చి 18 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. 712 మంది పదోతరగతి, 493 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతారన్నారు. 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

మైస్కూల్ మై ఫ్రెడ్‌తో ఉత్తమ ఫలితాలు

ప్రశ్నపత్రం ప్రతీ పేజీ క్యూర్ కోడ్‌తో ఉంటుందని, ప్రశ్నపత్రంపై విద్యార్థి రోల్ నంబర్, బార్ కోడ్, మొదటిపేజీలో మైక్రో లెటర్, ప్రతీ పేజీపై నిలువున మూడు చోట్ల యునిక్ డిజిటల్ నంబర్ ముద్రించి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు , మరుగుదొడ్ల సదుపాయం కల్పించామన్నారు. పరీక్ష కేంద్రాలను మొబైల్ ఫోన్లు నిషేధిత ప్రాంతంగా పరిగణించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలలకు మైస్కూల్, మైఫ్రైడ్ నినాదంతో దత్తత అధికారులను నియమించామని, ప్రతీవారం పాఠశాలను సందర్శించి మోటివేట్ చేశారని తెలిపారు. ఈ ఏడాది మంచి ఉత్తీర్ణత సాధించగలమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డీఈఓ జి.పగడాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్

పార్వతీపురంటౌన్: షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన ఒకటి నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మంజూరుచేస్తున్నట్టు ఎస్సీ సంక్షేమ సాధికార అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ శనివారం తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్స్ అయిన టాన్నర్లు అండ్ ఫ్లేయర్స్, పారిశుద్ధ్య కార్మికులు పిల్లలకు ఏడాదికి రూ.3,000, హాస్టలర్‌కు సంవత్సరానికి రూ.8వేలు ఉపకారవేతనం మంజూరు చేస్తారన్నారు. దరఖాస్తును వచ్చేనెల 4వ తేదీలోగా ఆన్‌లైన్ చేసి సంబంధిత కాపీలను సచివాలయంలో అందజేయాలన్నారు.

చెట్టు పై నుంచి జారిపడిన వ్యక్తి మృతి



నారాయణరావు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలసలో చింత చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... నాయుడువలస గ్రామానికి చెందిన మత్స నారాయణరావు(46) చింత పండు బొట్టలు దులిపేందుకు తన పొలంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. బొట్టలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో చెట్టు కింద ఉన్న పశువులు కట్టే కొయ్యకు తల తగిలి తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు బాడంగి సీహెచ్‌సీకి తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు అక్కడి వైద్యాధికారులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నారాయణరావు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

104 అంబులెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం

104 అంబులెన్స్ ఉన్న స్థలానికి 10 అడుగుల దూరంలో ఉన్న చెట్టు పైనుంచి నారాయణరావు పడిపోయాడు. దగ్గరలో ఉన్నా.. పరిశీలించేందుకు రావాలని కేకలు వేసినా 104 సిబ్బంది రాలేదని భార్య రామలక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి నడిమింటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది మానవత్వం చూపలేదని ఆరోపిస్తున్నారు. ఇక మా గ్రామానికి 104 అంబులెన్స్ రావద్దని, వస్తే అడ్డుకుంటామని ఆ గ్రామ ప్రజలు అంబులెన్స్ ముందు ఆందోళన చేశారు.

రాజీయే రాజమార్గం

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజీయే రాజ మార్గమని, వివిధ తగాదాలలో వ్యక్తుల మధ్య రాజీ కుదిర్చి ఇరు పార్టీలకు సమన్యాయం చేయడమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను కాపాడు కోవాలని, దూరం చేసుకోరాదని, కుటుంబ సభ్యులు పట్టింపులకు పోయి కలహాలతో చక్కని జీవితాలను పాడు చేసుకొంటున్నారన్నారు. లేనిపోని తగాదాలకు పోయి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని, డబ్బును వృథా చేయవద్దన్నారు. ఈ మధ్య కాలంలో కుటుంబ తగాదాలు ఎక్కువగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర కలహాలు మాని పిల్లల భవిష్యత్ కోసం, మనమీద ఆధార పడ్డ వారి కోసం అహం వీడి రాజీకి రావాలని హితవు పలికారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం సివిల్ మరియు పరిష్కరించదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరిగిందని అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న కోర్టులైన విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, కురుపాం తదితర కోర్టులలో శనివారం మొత్తం 1,220 కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.రజని, ఎమ్.మీనాదేవి, జడ్జి ఫ్యామిలీ కోర్టు, అదనపు మూడవ జిల్లా న్యాయ మూర్తి, సికెందర్ భాషా, స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ కేసెస్ అండర్ ఎస్సీ, ఎస్టీ మరియు నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.పద్మావతి, స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ ఆఫెన్సెస్ ఉమెన్ మరియు ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నాగమణి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులు	
విజయనగరం	757
పార్వతీపురం	56
బొబ్బిలి	137
సాలూరు	76
శంగవరపుకోట	52
గజపతినగరం	34
చీపురుపల్లి	31
కొత్తవలస	63
కురుపాం	14
మొత్తం కేసులు	1220

బెదిరించి బంగారం దోపిడీ

• బాధితురాలికి తీవ్ర గాయాలు



చోరీ జరిగిన సత్యనారాయణ ఇంటిని పరిశీలిస్తున్న సీఐ తిరుమలప్రసాద్, క్లూస్‌టీం

రామభద్రపురం: మండల కేంద్రంలోని సోంపురం రహదారిలో శుక్రవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో అంతర్రాష్ట్ర దొంగలు భార్యాభర్తలను బెదిరించి బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంటి యజమాని, బాధితుడు రుద్రాక్షుల సత్యనారాయణ తెలిపిన వివరాలు... సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రలో ఉండగా అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు బయట తలుపులు డ్రిల్లింగ్ మిషన్‌తో కట్ చేసి ఇంట్లోకి ప్రవేశించారు. నేరుగా బెడ్ రూంలోకి వచ్చి ఒకడు సత్యనారాయణ మెడపై కత్తి పెట్టగా, మరొకడు ఇనుప రాడ్డుతో తన భార్యను పట్టుకుని ఇంట్లో ఎక్కడెక్కడ బంగారం, డబ్బు ఉందో చెప్పాలని బెదిరించారు. భార్య మెడలో ఉన్న పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు తీసి ఇవ్వాలని అడగగా ఆమె నిరాకరించింది. దాంతో ఆమె చేతిపై ఇనుపరాడ్డుతో బలంగా కొట్టాడు. వెంటనే ఆమె భయపడి మెడలోని బంగారం ఇచ్చేసింది. మూడో వ్యక్తి బీరువాలో ఏముందేమోనని వెతికి ఏమి లేకపోవడంతో బీరువాను చిందరవందర చేశాడు. ఇంతలో ఇంటి ముందర నుంచి ఏదో వాహనం వెళ్లడంతో కిటికిలోంచి బెడ్‌రూంలోకి లైటింగ్ వచ్చింది. దాంతో వారు పోలీస్ వాహనం వస్తుందన్న అనుమానంతో పరారయ్యారు. సెల్ ఫోన్లను రాడ్డుతో పగులగొట్టారు. ఆ ముగ్గురు హిందీలో మాట్లాడుతున్నట్టు బాధితులు తెలిపాడు. వారు పారిపోయాక పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ తిరుమల ప్రసాద్, ఎస్‌ఐ జ్ఞానేశ్వరరావు, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఇంట్లోని వస్తువులపై వేలి ముద్రలు సేకరించారు. చేతికి తీవ్ర గాయమైన మహిళను బాడంగి సీహెచ్‌సీలో చికిత్స అందించారు. బాధితుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

బొబ్బిలి: పెళ్లికి వచ్చి స్వగ్రామానికి వెళ్తుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బొబ్బిలిలో చోటు చేసుకుంది. రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాడంగి మండలం ఆనవరం గ్రామానికి చెందిన తామాడ అప్పలస్వామి(66) అదే మండలం గొల్లాదిలో బంధువుల వివాహానికి వచ్చాడు. అక్కడి నుంచి బొబ్బిలి మీదుగా స్వగ్రామం ఆనవరం వెళ్లేందుకు బొబ్బిలిలోని ఇందిరమ్మ కాలనీ వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని శరీరం నుజ్జయిందని హెచ్‌సీ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: అత్యాచారం కేసులో నిందితుడికి మూడున్నరేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఏడీజే న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్టు దిశ మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. భోగాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన చిల్ల ఈశ్వరరావు స్థానికంగా ఉంటున్న ఒక మహిళ ఇంట్లోకి 2022 ఏప్రిల్ 29న ప్రవేశించి అత్యాచారం చేసేందేకు యత్నించాడు. దీనిపై ఆమె దిశ మహిళా పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ కేటీఆర్.లక్ష్మి కేసు నమోదు చేయగా, సీఐ ఎం.శేషు దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితుడు ఈశ్వరరావుపై నేరారోపణ రుజువు కావడంతో 5వ ఏడీజే, మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి శుక్రవారం తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. కేసులో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు.

బంగారు ఆభరణాల చోరీ

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో శుక్రవారం అర్ధరాత్రి 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వరుపుల సత్యంబాబుకు ఇద్దరు కుమారులు వాసుదేవరావు, రాము ఉన్నారు. ఇద్దరూ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు వాసుదేవరావు మూడు రోజుల కిందట తన భార్యను తీసుకుని ఎస్.కోటలో నివసిస్తున్న అత్తగారింటికి వెళ్లాడు. ఇదే అదునుగా చూసుకుని గుర్తు తెలియని వ్యక్తి వాసుదేవరావు నివాసముంటున్న గదిలోకి చొరబడి 8 తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుని పారిపోయాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో బంగారు ఆభరణాలు లేకపోవడంతో వాసుదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్యకుమారి(క్లూస్ టీం) సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు.